Publications

United International Journal of Multidisciplinary Research (UIJMR)

An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal

ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-1 ;Jan,Feb,& Mar),2026

# ‘అచ్చతెలుగు రామాయణం’లో జాతీయాలు - వైశిష్ట్యం

**చిట్టి రవీంద్ర**

**పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ,యోగి వేమన విశ్వ విద్యాలయం.**

**Email:ravispecial6655@gmail.com**

**Article Received:**06-01-2026 **Article Modified:**06-02-2026

**Article Accepted:**08-02-2026 **Article Published:**10-02-2026

**DOI:**10.37854/UIJMR.2026.3.1.27

## పరిచయం:

అభినవ వాగానుశాసనుడు,కవిసార్వభౌమా అనే బిరుదులతో పిలువబడుతున్న కూచిమంచి తిమ్మ కవి 18వ శతాబ్దానికి చెందిన కవి.ఈయన తల్లిదండ్రులు గంగనామాత్తుడు,లచ్చమాంబ.కూచి మంచి తిమ్మకవి గారు రాజశేఖర విలాసం,కుక్కుటేశ్వర శతకం,శ్రీ భర్గశతకం,సర్వ లక్షణ సారా సంగ్రహం,సారంగధర చరిత్ర,అచ్చతెలుగు రామాయణం మొదలగు రచనలు చేశారు.ఈయన గురువు దెందులూరు లింగ నారాద్యుడు.తన గురించి లక్షణసారా సంగ్రహంలో కందరాడపుర సంస్థవాడనని చెప్పుకున్నాడు.కందరాడ గ్రామం తూర్పుగోదావరి జిల్లాలోని పిఠాపురం సమీపంలో ఉన్న ఒక గ్రామం.తిమ్మకవి అక్కడ కరణంగా ఉండేవాడు.కూచిమంచి తిమ్మకవి కుక్కుటేశ్వర స్వామి భక్తుడు.మామూలుగా కవులు రాజాశ్రమం కోరుతూ రచనలను వారికి అంకితం ఇస్తూ ఉంటారు.కానీ తిమ్మకవి తన రచనలను నరాంకితం చేయనని చెప్పాడు.ఈయనకి పిఠాపురాన్ని పరిపాలించిన రాజులలో ఒకరైన రావు చిన్న మాధవరావు గారు కవి సార్వభౌమా అనే బిరుదును ఇచ్చారు.రచనలలో భక్తి,ధర్మం,నైతిక విలువలతో పాటు ప్రజాభాష పట్ల గాఢమైన ప్రేమ స్పష్టంగా కనిపిస్తుంది.

తెలుగు సాహిత్యంలో రామాయణ అనువాదాలకు విశిష్ట స్థానం ఉంది.వాల్మీకి రామాయణాన్ని ఆధారంగా చేసుకొని అనేక మంది కవులు తమ కాలానుగుణమైన భాషా,సాంస్కృతిక అవసరాలకు అనుగుణంగా రచనలు చేశారు.ఈ క్రమంలో కూచిమంచి తిమ్మకవి రచించిన *అచ్చతెలుగు రామాయణం* ఒక ప్రత్యేక స్థానం సంపాదించింది.సంస్కృత ప్రభావం అధికంగా ఉన్న కాలంలో అచ్చతెలుగులో రామాయణాన్ని రచించడం ద్వారా తిమ్మకవి ఇతిహాసాన్ని సామాన్య ప్రజలకు చేరువ చేశాడు.పేరుకు తగ్గట్టుగానే అచ్చ తెలుగులో రామాయణం రాయడం జరిగింది.కూచి మంచి తిమ్మ కవి గారు అచ్చ తెలుగు రామాయణంలో ఆరుకాండలు,1300 పద్యాలు దీనిలో ఉన్నాయి.

Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-1 ;Jan,Feb,& Mar),2026

**జాతీయాలు:**

జాతీయాలు అనేవి ఆయా భాషలలో సహజంగా ఆవిర్భవించి,ప్రజల వ్యవహారంలో వాడబడుతూ ఉంటాయి. జాతీయాలను పలుకుబడులని,పదబంధాలని పిలుస్తుంటారు.ఈ జాతీయాలు చెప్పగానే అర్థం అయిపోతాయి.జాతీయాలు అనేవి ఆజాతి వాడుకలో,అనుభవంలో నుంచే,అనుభూతి నుంచో ఆవిర్భవించాయి.ఆంగ్లంలోని Idiom అనే పదానికి సమానకర్తకంగా తెలుగులో జాతీయమనే అర్థం వాడుతున్నారు.తెలుగు జాతీయాలు సాధారణంగా ప్రజల జీవనానుభవాల నుంచి,పల్లెటూరి సంస్కృతి నుంచీ,వాస్తవ జీవిత పరిస్థితుల నుంచీ ఆవిర్భావించాయి.జాతీయాలలో సంక్షిప్తత,లోతు,సార్వజనీనత కలిగి ఉంటాయి.అంటే చిన్న పదాల్లో పెద్ద అర్థం,అనుభవాన్ని ప్రతిబింబించడం,ఎవరికైనా వర్తించే విధంగా,లోతైన భావాన్ని వ్యక్తపరచగల శక్తి జాతీయాలకు ఉంది.జాతీయాలు కేవలం అనుభవాలు మాత్రమే కాకుండా నీతిని,హెచ్చరికని,జీవన మార్గదర్శకత్వాన్ని కూడా అందిస్తాయి.

**వ్యాస సంగ్రహం:**

ఈ పరిశోధన వ్యాసం కూచిమంచి తిమ్మకవి రచించిన *అచ్చతెలుగు రామాయణంలోని* జాతీయాల ప్రయోగ విధానం,సందర్భ ప్రాధాన్యం,భాషా,సాంస్కృతిక విలువలను విశ్లేషిస్తుంది.జాతీయాలు అనేవి ప్రజల అనుభవాల నుంచి సహజంగా ఆవిర్భవించిన పదబంధాలు.ఇవి మానవ భావోద్వేగాలు,సామాజిక విలువలు,నైతిక దృక్పథాలను సంక్షిప్తంగా వ్యక్తపరుస్తాయి.తిమ్మకవి అచ్చతెలుగు రామాయణంలో జాతీయాలను కేవలం భాషా అలంకారాలుగా కాకుండా,పాత్రల అంతర్మన స్థితిని,ధర్మ,అధర్మ సంఘర్షణలను,మానవ మనోవ్యవహారాలను స్పష్టంగా ప్రతిబింబించే సాధనాలుగా వినియోగించాడు.ఈ అధ్యయనం జాతీయాలు ఇతిహాసాన్ని ప్రజల జీవనానుభవాలకు ఎలా దగ్గర చేశాయో వివరిస్తుంది.అచ్చతెలుగు రామాయణంలో వాడబడిన జాతీయాలను గుర్తించడం,వాటి అర్థం,సందర్భం,భావసాంద్రతను విశ్లేషించడం,జాతీయాలు పాత్రల మానసిక స్థితిని ఎలా వ్యక్తపరుస్తాయో పరిశీలించడం,జాతీయాలలో ప్రతిబింబించే సామాజిక,సాంస్కృతిక విలువలను అధ్యయనం చేయడం ఈ వ్యాస ఉద్దేశ్యం.

**కీలక పదాలు:**

అచ్చతెలుగు రామాయణం,కూచిమంచి తిమ్మకవి,జాతీయాలు,తెలుగు ఇతిహాస సాహిత్యం,ప్రజాభాష,సంస్కృతి,మానవ మనోవ్యవహారం.

**<u>తలకు బాసిన వెంట్రుక : (విలువలేనిది అని అర్థం )</u>**

మనిషి జీవితంలో చిన్న చిన్న కష్టాలను కూడా ఓర్చుకోలేకపోతే పెద్ద ధ్యేయాలు,ఆశయాలు సాధించడం అసాధ్యం.స్వల్పపాటి నొప్పి,చిన్న చిన్న బాధలు,ఇబ్బందులు వచ్చినప్పుడు వెంటనే వెనకడుగు వేయడం,ప్రయత్నం చేయకపోవడం వలన మనసులో ఉన్న

Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-1 ;Jan,Feb,& Mar),2026

గొప్ప లక్ష్యాలు నెరవేరవు.స్థిరంగా ఉండడం,వాటిని తట్టుకొని ముందుకు వెళ్ళడం మనసుకు బలం.చిన్న ఇబ్బందుల్లోనే తడబడి,గట్టిగా పట్టుకున్న మాటల్ని వదిలేయడం అంటే తలకు బాసిన వెంద్రుక లాగా నిరుపయోగం.తల మీద నుంచి ఊడిన వెంట్రుక ఏ పనికిరాదన్న మాట.

రాముడు అరణ్యవాసానికి వెళ్లేటప్పుడు సీత రామునితో తాను కూడా తనతో పాటి అరణ్యవాసం వస్తాను అంటుంది.అప్పుడు రాముడు సీతకు అడవిలో ఉండే కష్టాలు,ప్రమాదాలు చెప్పి వెనక్కి వెల్లమంటాడు.అప్పుడు సీత ఇలా అంటుంది....

**‘ఉడుగక బుత్తి,ముత్తులిడ నోపి యొడళ్ళుఱలేక యుండఁగాఁ**
**గడు నెదలోఁ దలంచుకొని గాటపు మక్కువఁ బ్రోది సేయు న**
**య్యెడయనిఁ బాసి యాగడపు టోజలఁ ద్రిమ్మరునట్టి గట్టి వా**
**పడఁతుక యెయ్యెడం‘దలకుఁబాసిన వెంద్రుకగాదె’ యెన్నఁగన్’(అయోధ్యా కాండ.72)**

ఇల్లు చూసుకునే గృహిణి బాధలు,కష్టాలు,ఒంటరిగా ఉండలేక తీరని ఆశలు హృదయంలో పెట్టుకొని అనుచిత ఆకర్షణ,పరుల మీద చెడు చూపు మొదలైన పనులు చేయడం,భర్త తోడూలేని,భర్తను విడచి అల్లరిగా తిరిగే వారు విలువలేని తల నుండి ఊడి పడిన వెంట్రుక లాగా పనికిరాని,తృణప్రాయమైనదని చెబుతుంది.ఇక్కడ సీత మాటలలో తన స్థానం,ధర్మం,బాధ్యత స్పష్టంగా కనబడుతుంది.స్త్రీకి గౌరవం భర్తతో కలసి జీవించడమే,భర్తను విడిచి ఉండటం ఆత్మస్వరూపాన్ని కోల్పోవటమే అని తెలుస్తుంది.

స్త్రీ భర్తతో అనుబంధం,వ్యక్తిగత గౌరవం,నైతికత,దాంపత్య ధర్మం,కుటుంబ బద్ధత వంటి అంశాలు ఆ కాలపు సామాజిక,నైతిక విలువలకు ప్రతిబింబించటం.ఇప్పటి సమాజంలో స్త్రీ,పురుష సమానత్వం,వ్యక్తిగత స్వేచ్ఛ వంటి భావనలు అభివృద్ధి చెందినా సీత మాటలను ఆ కాలపు *ఇతిహాస,సాంస్కృతిక కాలం* దృష్టితో చూడాలి.

## పేరుగల యింటి : (పేరు,ప్రతిష్ట కలిగిన ఇంట్లో అని అర్థం)

పుట్టుకతో వచ్చిన వంశగౌరవాన్ని సూచించే పదం మాత్రమే కాదు,ఆ ఇంటి పెద్దలు నిలబెట్టిన నైతిక సంపద,విలువలు,సంస్కారంల సంకేతం.తరాల తరబడి వారసులకు మకుటాయమానంగా ఉంటుంది.విలువలు,నీతి, సంప్రదాయం నిలబెట్టుకున్న వంశం అని అర్థం.

కైకేయి మంథర మాటల ప్రభావంతో దశరదునితో రామునికి వనవాసం,భరతునికి పట్టాభిషేకం కోరుతుంది.ఈ ఆవేశపూరిత పరిస్థితిలో,దశరథుడు కైకేయితో తన ప్రేమను,తన మానసిక బలహీనతను,తన అసహాయతను ఇలా వ్యక్తం చేస్తాడు.

**'పేరుగల యింటి' నెఱ రాచబిడ్డవనుచుఁ**
**దలఁచుచుండుదు నెదఁ జాల వలపు మీఱ**
**వాలుగంటిరో! యిపు డింత బేలవగుట**
**కయ్యయో! యింక నిన్నేమి యనఁగఁ గలదు!’(అయోధ్య కాండ.24)**

Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-1 ;Jan,Feb,& Mar),2026

పేరున్న,గొప్ప రాజ వంశంలో పుట్టిన రాజకుమార్తె కదా నువ్వు నా హృదయం నీ గురించి ఒకటే ఆలోచిస్తుంది.నీ ప్రేమలోనే పూర్తిగా మునిగిపోయను,నాకు ప్రియమైన దానివి ఇప్పుడు నీ కోరికలతో ఇలా బలహీనుడుగా మరాను నీ గురించి ఇంకా ఏమి చెప్పగలను,నిన్ను ఏమి అనగలను నీ ప్రేమ నా మీద అంతగా ప్రభావం చూపుతోంది.

ఇక్కడ దశరదుడిలో రాజుగా,భర్తగా,ధర్మరక్షకుడు అనే మూడు పాత్రల మధ్య జరుగుతున్న అంతర్గత యుద్ధానికి అద్దం పడుతుంది.దశరథుడు రాజు అయినప్పటికీ భార్య ప్రేమ ముందు రాజాధికారమంతా నిస్సత్తువగా మారిపోవడం గమనిచవచ్చు.ధర్మం,ప్రేమ విరుద్ధంగా నిలుస్తాయి,అలాగే ప్రేమ,ధర్మాల మధ్య సంఘర్షణ చూడవచ్చు.వ్యక్తిగత ప్రేమ ముందు బలహీనులవుతారనేది సత్యం.

**<u>ఆరడి బెట్టు:(కారణం లేకుండా నింద మోపడం అని అర్థం)</u>**

కారణం లేకపోయినా,ఇతరుల మీద తప్పు నెట్టడం,నింద పెట్టడం అని అర్థం.ఎవరినైనా *విమర్శిస్తూ, నిందిస్తూ,తప్పుబడుతూ, కఠినంగా మాట్లాడటం* అన్న భావం ఏర్పడింది.

కైకేయి చెప్పిన మాటలకు దశరధుడు దిగ్భ్రాంతికి గురై తన ప్రియభార్య నోటినుండి ఇలాంటి మాటలు రావడంతో దశరదుడు బాధపడుతూ రామున్ని అరణ్యవాసం పంపలేను అని చెప్తున్న సందర్భంలో………

**‘ఆఱడిఁ బెట్టెదనని'మది**
**నాఱని చలమూని కఱకు లాడెద వకటా!**
**నూఱేడుములు వొదవిన నీఁక**
**గాఱడవుల కనుపఁజాలగద యిక్కొడుకున్’ (అయోధ్య కాండ.25)**

నిన్ను నిందపెడతానని కోపంతో,ఈర్ష్యతో ఎంత కఠినంగా,హింసాకరంగా నన్ను మాట్లాడుతున్నావు.నూరు కష్టాలు వచ్చినా,ఎంత ఒత్తిడి చేసినా సరే నా ప్రియపుత్రుని దూరం చేయలేను,నేను రామున్ని అడవికి పంపలేను అని అంటాడు.దశరధుని జీవితంలో అత్యంత విషాదమయమైన క్షణం ఇదే.దశరధుడు ఒక వైపు భర్తగా కైకేయిని ప్రేమిస్తున్నాడు,మరోవైపు తండ్రిగా రాముపై అపారమైన మమకారం కలిగి ధర్మ సంకటంలో తల్లడిల్లుతున్నాడు.ప్రేమ,ద్వేషాల మిశ్రమ స్థితి,మానవ మనసులో ప్రేమ,నిరాశ,కోపం,ధర్మం మధ్య జరిగే క్లిష్టమైన పరిస్థితిని చూడవచ్చు.రాజ్యపాలనలో,కుటుంబ ధర్మంలో,వ్యక్తిగత సంబంధాలలో ఒక ఆత్మీయ,మానసిక సంక్షోభానికి దశరదుడు ప్రతీకగా కనిపిస్తాడు.దశరధుడు ఒకే సమయంలో రెండు వ్యతిరేక భావోద్వేగాల మధ్య చిక్కుకున్నాడు.*భార్యపై* ప్రేమ,పుత్రునిపై *మమకారం* ఈ రెండు విలువల మధ్య జరిగిన ఘర్షణలో నేను రామున్ని విడవలేనన్న అచంచలమైన తండ్రి ప్రేమ కనిపిస్తుంది.ప్రేమ,కోపం,అలాగే నింద,మమకారం అనే యుగ్మ శక్తుల మధ్య తీవ్ర దూరం కనిపిస్తుంది.ఇది మానవ మనస్సు యొక్క శాశ్వత స్వాభావికతను సూచిస్తుంది.

**పడరాని పాట్లు:(అనవసరమైన కష్టాలన్నీ పడడం అని అర్థం)**

పడలేని,తట్టుకోలేని,భరించలేని కష్టాలు,బాధలు,వేదనలు,శ్రమలు పడడం.మనిషి జీవితంలో ఎదురయ్యే అత్యంత తీవ్రమైన,నిరంతరమైన కష్టాలను సూచిస్తుంది.ఇవి సాధారణ ఇబ్బందులు కాకుండా శారీరకంగా భరించలేని శ్రమలు,మానసికంగా మనసును పీల్చివేసే వేదనలు,సామాజికంగా అవమానాలు,అన్యాయాలు,ఆర్థికంగా దరిద్రం, అప్పుల బాధలు ఇలాంటి పరిస్థితుల్లో మనిషి ఆత్మస్థైర్యం కోల్పోయి ఇంతకన్నా ఇక తట్టుకోలేను అన్న స్థితికి చేరుతాడు. అప్పుడు అతని జీవితం మొత్తం పాట్లతో నిండిన బాధాకర ప్రయాణంగా మారుతుంది అదే పడరాని పాట్లు.

కైకయి తన రెండు వరాలు దశరదుని ఇప్పుడు ఇవ్వమని అడుగుతుంది.కైకేయి కోరిన రెండు వరాలలో ఒకటి రాముడు అరణ్యవాసం వెళ్లడం,రెండొవది భరథుడికి రాజ్య పట్టాభిషేకం.ఇది విని దశరథుడు విచ్ఛిన్నంగా మారిపోతాడు.అతని అంతరంగపు విషాదాన్ని ఇలా వ్యక్తపరిచే సందర్భంలో……….

**'తడవేఁడు లయ్యెఁ దనకుం**
**గొడుకులు లేరనుచు ముందుఁగుందుచు నెన్నో**
**'పడరాని పాట్లు' పడి యిపు**
**డడవులకుం ద్రోచుకొనుట యరుదై తోఁచున్'(అయోధ్య కాండ.84)**

దశరథుడు రాజు అయిన తనకు సంతానం కలుగక ఎన్నో సంవత్సరాలు గడిచిపోయాయి.సంతానం కోసం ఎన్నో రకాలుగా మనసులో బాధపడుతూ,వ్రతాలు,యాగాలు చేసి ఎన్నో భరించలేని కష్టాలు,బాధలు అనుభవించి చివరికి పుత్రకామేష్టి యాగం తరువాత సంతానం కలిగింది.ఇప్పుడు ఆ కొడుకునే అడవుల్లోకి పంపాల్సి రావడం తీరు నాకు అత్యంత విచిత్రం,విరుద్ధం,అన్యాయం వంటి బాధను కలిగిస్తోంది.ఇక్కడ రాముణ్ని వనవాసానికి పంపాల్సిన పరిస్థితి రావడం దశరథుడికి తట్టుకోలేని మానసిక శోకం చూడవచ్చు.

దశరథుడు ధర్మానికి ప్రతీక.అయితే ఇప్పుడు ధర్మమే అతనికి బాధను కలిగిస్తోంది.సత్యవ్రతం పాటించాల్సిన అవసరం,వరాలను నిలబెట్టుకోవాల్సిన నైతిక బాధ్యత,మనసు–బుద్ధి మధ్య జరిగే సంఘర్షణ ఇవి ఈ మూడు కలిసి దశరథుడిని చివరకు ప్రాణాంతక శోకానికి నెట్టాయి.ఇక్కడ ధర్మం,భావం మధ్య అంతఃసంఘర్షణ వ్యక్తమవుతుంది.కైకయికి ఇచ్చిన వరాలు అప్పటి పరిస్థితిలో సులభంగా ఇచ్చినవైనా వాటి ఫలితం ఇప్పుడు జీవితాంతం భారంగా మారింది అందుకే అవి దశరథునికి పడరాని,అనవసరమైన,అనర్థమైన కష్టాలుగా తెలుస్తున్నాయి.

**తప్పటడుగులిడుచు:( స్థిరత్వం లేని స్థితి నిరుత్సాహంగా అడుగులు వేయడం అని అర్థం)**

Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-1 ;Jan,Feb,& Mar),2026

మనసు తీవ్ర వేదనతో,ఆలోచనలతో చిత్తగించిపోయి అంతర్మథనంతో కూడిన నడక, దుఃఖం వల్ల శక్తి క్షీణించిన స్థితి,గమ్యం తెలియని ఆత్మవేదన దిశా,ధైర్యం కోల్పోయిన స్థితిని సూచిస్తుంది.మనసే ముందుకు నడవలేని స్థితి దుఃఖం మనిషిని ఎలా కుంగదీస్తుందో తెలుపుతుంది.

రావణుడు సీతను అపహరించి తీసుకు వెళ్లినప్పుడు సీత జాడ కోసం హనుమంతుడు లంకలోకి ప్రవేశిస్తాడు.సీత జాడ ఇంకా కనపడలేదనే దుఃఖంతో నిరుస్తాహంతో నడుచుకుంటూ వెళుతున్న సందర్భంలో .. .. ..

**'కని తప్పటడుగు లిడుచుం**

**జని మెల్లనె యందు దూఱి జతనంబున నిం**

**తిని నెమకుచు ప్రాలం జ**

**క్కని బంగరు మేడ యొకటి గనుఁగొని సరగన్'(సుందర కాండ.26)**

సీతను ఇంకా కనుగొనకపోవడంతో ఆందోళనతో,నిరాశతో తడబడుతూ అడుగులు ముందుకు వేస్తూ అశోకవనంలోకి నెమ్మదిగా ప్రవేశించి జాగ్రత్తగా,తన ప్రయత్నాన్ని మరిచిపోకుండా ముందుకు సాగిపోతూ అంతా పరిశీలిస్తున్నాడు.అప్పుడు హనుమంతుడు అక్కడ ఒక అందమైన బంగారు మేడను రావణుడి అంతఃపుర ప్రాంతాన్ని చూడగానే అతడు దాని వైపుకు త్వరగా ముందుకు సాగాడు.

హనుమంతుడు మనసు కలవరంతో,భయంతో,ఉత్కంఠతో తడబడుతూ అడుగులు వేస్తూ ముందుకు సాగాడు ఇక్కడ నడక,చూపు,నిలకడ మూడు కూడా అంతర్మన స్థితిని ప్రతిబింబిస్తాయి.సీత కనిపించకపోవడం వల్ల కలిగిన భాద,పని సాధ్యం కాదేమో అన్న భయం అలాగే సీత ఇక్కడే ఉండొచ్చేమో అన్న ఆశ,శత్రు రాజధానిలో పశుపక్ష్యాలా జాగ్రత్తగా కదలనే అవసరం ఈ మానసిక భారానికి భౌతిక రూపమే తప్పటడుగులు.

## దొడ్డు కొంచెంబులు:( ఎక్కువ తక్కువలు అని అర్థం)

పెద్దది,చిన్నది అనే తేడా సామర్థ్యాలలో అసమానత,ధనవంతులు,పేదలు మధ్య వ్యత్యాసం.శక్తివంతులు,బలహీనులు మధ్య భేదం,ఒకే వ్యవస్థలో ఉన్న విభిన్న స్థితులను మొదలగు సందర్భాలలో చెప్పడానికి ఉపయోగిస్తారు.

సీతను కనుగొని తిరిగి వెళ్లే ముందు,హనుమంతుడు కావాలనే రావణుని సమక్షంలో రావణునికి రాముని గూర్చి,రాముని బలపరాక్రమాలను గురించి తెలియజేస్తున్న సందర్భంలో.............

**'నీదు పంపున నిలిఁయై నెఱిని జన్న**

**కూళ తొలివేల్పు నొక కోలఁ గూలనేసె**

Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-1 ;Jan,Feb,& Mar),2026

నట్టి రామునియందు నీయందుఁ గలుగు

'దొడ్డు కొంచెము' లెంచుమా! త్రుళ్ళు సడలి'(సుందర కాండ.157)

నీవు మయా లేడి రూపంలో పంపిన మారీచూడు సైతం రాముని బాణానికి నిలబడలేక పోయాడు.అలాంటి ధర్మస్వరూపుడు, మహావీరుడు అయిన రాముని ముందు నీ అహంకారం వదిలిపోక తప్పదు.కాబట్టి నీ శక్తి,నీ రాజ్యం,నీ బాహుబలం,నీ ఆయుధాలు రాముని శక్తితో పోలిస్తే ఏ మేర ఉన్నాయో పరిశీలించి నీ బలం,రాముని బలం మధ్య వ్యత్యాసాన్ని అంచనా వేసుకో అని అంటాడు.

ఇక్కడ రాముని బలాన్ని పరస్పర చర్యల ఆధారంగా గుర్తుచేసే వ్యూహం,శక్తిని ఎదరించిన అహంకార నిర్మూలన తెస్తుంది.హనుమంతుడు ఇక్కడ సంపూర్ణమైన రాజనీతి,ధర్మ నీతిను వినియోగిస్తున్నాడు.ఇక్కడ ఒక రకమైన మానసిక మేల్కొలుపు,అహంకారంలో ఉన్న వ్యక్తి తన బలం,దౌర్బల్యాలు చూడలేడు.అలాంటి సందర్భంలో దొడ్డు కొంచెము అనే పద వినియోగం తనస్థితి మీద విమర్శనాత్మక అవగాహనను తెలియజేస్తుంది.స్థితిజ్ఞానం లేకపోతే పతనం తప్పదు.

**తెలి నీళ్లు :(నిర్మలమైన,మలినంలేని స్వచ్ఛమైన నీరు అని అర్థం)**

మనసు,స్వభావం,ఆలోచనల స్వచ్ఛతకు అలాగే నిజాయితీ,నిర్మలమైన మనసు,మోసములేని స్వభావం అనే భావాలనుసూచిస్తుంది.కలుషితం కాని జీవితం,ధర్మంతో నడిచే జీవన విధానం,ఆత్మశుద్ధికి అంతర్గతంగా మనస్సు,నైతికతపవిత్ర్యం,నిర్మలత్వానికి అతి అందమైన ప్రతీక.

సీత అన్వేషణలో భాగంగా వానర బలగాలు అనేక పర్వతాలు,అరణ్యాలు,దీవులు దాటి అలసటతో నిండిపోయారు.వింధ్య పర్వత సమీపంలో శ్రమతో శ్వాస తీసుకోవడం కూడా కష్టంగా మారినపుడు వారు కొంత సేదతీరడానికి ఆ ప్రాంతపు ప్రకృతిలో ఆశ్రయం తీసుకుంటారు.

'అక్కొమ్మ మెకపు జోదులు
నిక్కుచు నక్కొండ యెక్కి విరి దేనియలం
జొక్కటపుఁ దీయ పండుల
జక్కర తెలినీళ్ళ నలుపు సడలించి తగన్'

వానరులు నిటారుగా ఉన్న ఆ శిఖరాన్ని ఎక్కి,అక్కడ పరిమళభరితమైన అరణ్య పుష్పాలు విరివిగా లభించే పూలతేనెను పుచ్చుకున్నారు.బాగా పండిన,మృదువైన తియ్యని పండ్లుని సహజంగా రసభరితంగా ఉన్న పండ్లు వానరులు తేనితో పాటు ఆ ప్రాంతంలో పండిన తీయని పండ్లను కూడా పొందారు.పండ్ల రసం అలసటను తగ్గించి శరీరానికి పోషణనిచ్చింది.సమీపంలో ప్రవహిస్తున్న స్వచ్ఛమైన నీటిని సేవించి తమ శరీరంలో ఉన్న వేడి,అలసట,దాహం అన్నింటినీ పూర్తిగా తీర్చుకున్నారు.

Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-1 ;Jan,Feb,& Mar),2026

కవి ఇక్కడ ప్రకృతి స్వయంగా వారికి అందిస్తున్న సహాయాన్ని బలంగా చిత్రించాడు ఇది ప్రకృతిలోని రుచికరమైన,పోషక శక్తికి ప్రతీక.ఇక్కడ మనస్సు,శరీరం పరిశుభ్రతకు ప్రతీకలా నిలుస్తుంది.తేనె శక్తిదాయకం పండ్లు పోషకాహారం తెలినీరు శరీరం,మనస్సుకు శాంతి ఈ మూడు కలిపి వానరులకు సంపూర్ణ విశ్రాంతిని కలిగించాయి.ఇవన్నీ ప్రకృతి స్పర్శను వినిపించేలా ఉంటాయి.

**మిడిమేలము:(గర్వం,అహంకారి,ఎవ్వరి మాట వినని వాడు అని అర్థం)**

తనకు అన్నీ తెలిసినట్లుగా గర్వంతో ప్రవర్తించే వ్యక్తిని సూచించడానికి వాడతారు.గర్వం,అహంకారం,స్వంత స్థితి,సామర్థ్యం తెలుసుకోకుండా,తాను గొప్పవాడిననే తప్పుడు భావం.అర్ధజ్ఞానం,అల్పజ్ఞానంతో గొప్పలు చెప్పుకోవడం.అనర్హత,అహంకారం అనే రెండు లక్షణాల సమ్మేళనం.

గౌతముని శాపంతో రాయిగా మారిన అహల్య,రాముని పాదస్పర్శవల్ల విముక్తమై అతని దివ్యగుణాలను గానిస్తోంది. అహల్య తన భారత గౌతముని శాపం వల్ల రాయిగా మారినా నేను నీ పాద ధూళి తగిలి శాప విమోచన కలిగిన ఆనందంలో రాముణ్ణి స్తుతించు సందర్భంలో....

**'వెన్నునిఁ జూపుమంచు బదివేల వితంబులఁ గన్నబిడ్డని**
**నిన్నక స్రుక్కఁజేయు మిడిమేలపు నంజుడు దిండి రాచ బ**
**ల్మన్నియఁ జెండవే? బిరుసు మానిసి సింగపు మేనుపూని యో**
**యన్న! పసిండి బొజ్జదొరకైన నినుం గొనియాడఁ బోలునే?'(బాల**
**కాండ.128)**

విష్ణువును చూపెట్టమని ప్రహ్లదున్ని కన్నకొడుకని చూడకుండా పదివేల విధాలుగా బాధలను పెట్టిన గర్వంతో తానే జగత్తుని అధిగమించిన శక్తివంతుడు అని అహంకరించే,తన తపస్సును దైవమైన అధికారంగా భావించే దేవతలను,సత్యాన్ని,విశ్వ న్యాయాన్ని ఉపేక్షించే,అహంకారంతో,అర్ధజ్ఞానంతో,తాను లోకంలో అత్యున్నతుడినని గొప్పలు చెప్పుకున్న హిరణ్యకశిపుడిని నరసింహరూపం ధరించి ఆ రూపంతో సంహరించావు.ఓ రామా!నీవు వేలాది దివ్యరూపాల కాంతిని కలిగినవాడవు.మంచువలె తెల్లని,కాంతివంతమైన ఎన్నో వేల మహిమాన్విత రూపాలు అలాంటి మహిమ గల దైవరూపాన్ని కలవాడవు,అపార శక్తి నిండిన నిన్ను,నీ మహిమను బ్రహ్మదేవుడే అయినా పూర్తిగా స్తుతించగలడా? నేను ఎలా నీ మహిమను పూర్తిగా వర్ణించగలను. అహంకారానికి,అర్ధజ్ఞానానికి,దేవద్వేషానికి పరాకాష్ట హిరణ్యకశిపుడు.

**ముగింపు:**

Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-1 ;Jan,Feb,& Mar),2026

కూచిమంచి తిమ్మకవి అచ్చతెలుగు రామాయణం సృజనాత్మక ప్రతిభకు,భాషాపరమైన స్వతంత్రతకు ప్రతీకగా నిలబడుతుంది.వాల్మీకి రచించిన రామాయణం మహాకావ్యాన్ని అచ్చతెలుగులో రాయడమే కాకుండా,ప్రజల నిత్యజీవితానికి దగ్గరైన జాతీయాల ద్వారా ఇతిహాస పాత్రలను చిత్రించడంలో తిమ్మకవి అపూర్వమైన కవిత్వ దృష్టిని ప్రదర్శించాడు.ఈ జాతీయాలు కేవలం భాషా అలంకారాలు మాత్రమే కాక అప్పటి సమాజంలోని కుటుంబ ధర్మం,నైతిక విలువలు,మానవ మనస్సులోని సంఘర్షణలు,భావోద్వేగాల ప్రతిఫలంగా నిలుస్తాయి.అచ్చతెలుగు రామాయణంలో జాతీయాల ప్రయోగం భాషను ప్రజల జీవనానుభవాలకు దగ్గర చేస్తుంది.సంస్కృత ప్రభావం అధికంగా ఉన్న కాలంలో కూడా తిమ్మకవి అచ్చతెలుగు పదప్రయోగం ద్వారా సామాన్య ప్రజలకు ఇతిహాసాన్ని అందించాడు.తిమ్మకవి జాతీయాలను అత్యంత సహజంగా, సందర్భానుగుణంగా వినియోగించడం ద్వారా ఇతిహాస పాత్రలను ప్రజల మధ్య జీవించే మనుషులుగా తీర్చిదిద్దాడు.జాతీయాలు కథనాన్ని అలంకరించే సాధనాలుగానే కాక,పాత్రల అంతర్మనస్సును వారి నిర్ణయాల వెనుక ఉన్న భావోద్వేగాలను ధర్మ,అధర్మాల మధ్య జరిగే సంక్లిష్ట సంఘర్షణలను స్పష్టంగా ప్రతిబింబించే మాధ్యమాలుగా మారాయి.ఈ జాతీయాలు కాలాతీతంగా నిలిచిపోయి నేటి సమాజంలోనూ అర్థవంతంగా వినిపించడం వాటి సార్వజనీనతకు నిదర్శనం.

**ఆధార గ్రంథాలు:**

కూచిమంచి తిమ్మకవి.అచ్చ తెలుఁగు రామాయణము.(టీక-తాత్పర్యము) భాషాప్రవీణ డా.బులుసు
వేంకట సత్యనారాయణమూర్తి.ముద్రణ : పద్మజా ప్రింటర్స్,రాజమండ్రి.
తెలుగు జాతీయాలు.- డా॥బూదరాజు రాధాకృష్ణ. ముద్రణ: శ్రీ కళాంజలి గ్రాఫిక్స్ హైదరాబాద్ – 29.
సామెతలు జాతీయాలు.- డా॥ ద్వానా శాస్త్రి. సూర్య ప్రచురణ: సూర్య ప్రచురణలు 37/202, రామ్మోహన్
టవర్స్ హుడా కాంప్లెక్స్, హైదరాబాదు 500 035, హైదరాబాద్.
వాల్మీకి రామాయణము(యథామూలనువాదం). – పుల్లెల శ్రీరామచంద్రుడు. ముద్రణ: కళాజ్యోతి ప్రాసెస్
ప్రైవేట్ లిమిటెడ్,హైదరాబాద్.
ఆంధ్ర వాల్మీకి రామాయణము.- వావిలకొలను సుబ్బారావు.
సంపూర్ణ వాల్మీకి రామాయణం(ఏడుకాండల సంగ్రహ వచనం.- శ్రీమాన్ రొంపిచెర్ల శ్రీనివాసచార్యులు.
ప్రచురణ: ఆధ్యాత్మిక గ్రంథ ప్రచురణ కర్తలు,కోటగుమ్మం,రాజమండ్రి – 533101.
తెలుగు జాతీయాలు వాటి పుత్తు పూర్వోత్తరాలు. - డా॥ ॥బూదరాజు రాధాకృష్ణ.పబ్లిషర్స్:క్రియేటివ్ లింక్స్
పబ్లికేషన్స్.(1 జనవరి 2019).

Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-1 ;Jan,Feb,& Mar),2026

తెలుగు జాతీయాలు. - డా. వెలగా వెంకటప్పయ్య(సంపాదకుడు). పబ్లిషర్స్ : నవరత్న బుక్ హౌస్.